# శరణాలయం ::

రచయిత :
జి. వి. యస్. నాగేశ్వరరావు.

"క్రానీ, తిండికిలేక యీజాతి మలమలామాడి పోతూంటే చూస్తూ వూరుకుంటుంది ప్రభుత్వం— వీరి వ్యవహారాలు భూమ్యాకాశాలు నిండిపోతున్నాయి. కాని ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదు...."

"ప్రతిదీ ప్రభుత్వం నెత్తినపడేసి ప్రజలు ఉదాసీనంగా కూర్చుంటే దేశాభ్యుదయం జరగటం అసంభవం. ఇవన్నీ చిల్లరసమస్యలు—ప్రజలే వీటిని పరిష్కరించుకోవాలి."

"ఇదీ ఒక చిల్లరసమస్యే అంటారా!" ఆశ్చర్యంగా అడిగాడు రామారావు.

"కాక? మరి?" అని వెంటనే గంభీరంగా ప్రత్యుత్తరమిచ్చాడు దీనానాధుడు.

"మనలో సహానుభూతిభావం దినదినం క్షీణించిపోతోంది" రామారావు నిరుత్సాహాన్ని వెలిబుచ్చాడు.

"అలా అనకండి. ప్రజలు తలచుకుంటేచేయలేనిదిఅంటూ ఒకటిలేదు. మహాసామ్రాజ్యాలంటివి ప్రజల కోపాగ్నికి భస్మీపటలమైపోయినట్లు చరిత్ర చెపోంది. ప్రజలు కనికరిస్తే—దయతలిస్తే-బుక్కాపకీరు చక్రవర్తి కాగలడు. ఇది అంతే అనుకోండి—"

దీనానాధుని మాటలకు అడ్డువచ్చి రామారావు "అయితే బిచ్చగాండ్ర సమస్య ఏవిధంగా పరిష్కరింపబడాలని మీ అభిప్రాయం?" అని అడిగాడు.

"ఒక స్వార్థత్యాగి నిలబడి కష్టనిష్ఠూరాలకు వెఱవకుండా పనిచేయాలి. శ్రీమంతుల హృదయాలు కరిగించి నిధిని వసూలుచేసి ఒక సరియైన శరణాలయం స్థాపించాలి. అందులో గృహపరిశ్రమలు స్థాపించి వికలాంగులతో గ్రుడ్డివారితోగూడా పని చేయించి వారిని పోషించాలి. వికలాంగులు గ్రుడ్డివారుకూడా చేయతగిన లాభదాయక పరిశ్రమలు బోలెడున్నాయి. శరణాలయాలు కేవలం దారిద్ర్య విముక్తికేకాకుండా దేశీయ పరిశ్రమాభివృద్ధికికూడా కారణభూతములై వుంటాయి. ఈ విశాలాంధ్రదేశానికి ఒక్క శరణాలయమైన లేకపోవడం శోచనీయం" అని యీసడింపుగా అన్నాడు దీనానాధుడు.

రామారావు రక్తం వేడెక్కింది. అతని నేత్రాల్లో అపూర్వజ్యోతి ప్రవేశించింది. "ఈ శరణాలయ నిర్మాణానికి నాసర్వస్వము ధారపోయుటకు సిద్ధంగానున్నా. కా....ని...ఒంటరిగా యిట్టి మహాకార్యాన్ని నిర్వహించ కలుగుతానాఅని" తరువాత పూర్తి చేయుటకు సందేహించాడు రామారావు.

"ఓస్, మీ కాభయం, సందేహం అవసరం లేదు. మీలాంటి ఆదర్శ త్యాగమూర్తులుంటేచాలు యీ కార్యాన్ని నేను సాధించగలను. మీరు సరే అనండి దానికి కావలసిన కార్యకలాపం నే నడిపిస్తా. వచ్చేఉగాదికి శరణాలయం స్థాపించామన్నమాటే. మానవసేవమే మాధవసేవ? సరే అంటారా?" అని రామారావు చేతిని పట్టుకొని కదలిస్తూ అడిగాడు దీనానాధుడు వుత్సాహంతో.

"తప్పకుండాను. కంకణబద్ధుణ్ణి" అని దీనానాధుని వాక్చాతుర్యానికి, వుత్సాహానికి ముగ్ధుడైపోతూ, వాగ్దానంచేసాడు రామారావు.

ఇంతలో రైలు బెజవాడ ప్లాటుఫారంమీదకు వచ్చింది. ఇరువురు ప్రయాణీకులు బండిదిగారు. "తిరిగి ఆదివారం సాయంత్రం తమ దర్శనంచేస్తా" అని దీనానాధుడు వెళ్లిపోయాడు.

* * *

రామారావు గుంటూరులో వకీలు. ఆగర్భ శ్రీమంతుడు. దేశ సేవాప్రియుడు.

దీనానాధుడు రహస్యమయుడు. ఆంధ్రుడు మాత్రంగాదు. కాని అతనిలో ఆంధ్రత్వము మూర్తీభవించినట్లగుపడుతుంది. అతని వాక్ప్రవాహం అమోఘమైంది. అతనిలో గొప్ప ఆకర్షణవుంది.

## 2

ఆరుమాసాల తర్వాత—

"నే ప్యాసింజరుకు వచ్చానోయ్. నీ పెళ్లికి రాకపోతే ఏమన్నా అనుకుంటావని యీ రాజమండ్రికి వచ్చాగాని లేకపోతే యిప్పట్లో యిలావచ్చే సమయం కాదు."

"నాకూ యిప్పట్లో వచ్చే సమయంకాదు బావా. సర్జరీలో పరీక్షలు సమీపించాయి. ఏదో తప్పనిసరిగా వచ్చాననుకో యీ అర్ధరాత్రిబండీకి సరిగ్గా లగ్నానికి అందుకునేలాగా. సరేగాని నీ ఫైలు పెరిగిపోయిందా ఏం? బొత్తిగా తీరిక లేకపోవటానికి?"

"ఫైలుగాదోయ్. ఒక అనాథ శరణాలయం స్థాపించబోతున్నాం గుంటూరులో. నీవు M. B., B. S. ప్యాసయినతర్వాత శరణాలయం డాక్టరుగా పనిచేయాలి. ఇప్పటికి సుమారు లక్ష రూపాయిలు నిధి వసూలయింది. ఇంకా వసూలు కావల్సింది చాలావుంది. ఉగాదికి భవనం—తోట—పరిశ్రమశాలలు—అన్నీ పూర్తికావాలి."

"నిరభ్యరంతరముగా నీ శరణాలయానికి సేవ జేస్తా బావా. యీ మహోత్తరకార్యం తలబెట్టినందుకు నీజీవితం సార్థకమౌతుంది."

"ఇదంతా దీనానాథుని ప్రేరణ. అతనిలోని మహాశక్తియే నాచేత యిలా పనిచేయిస్తోంది"

"దీనానాథుడెవరు బావా?"

"ఒక దీనబంధువు — కర్మవీరుడు—స్వార్థత్యాగి—మహాయోగి—అసమాన మేధావి—"

"అంత మహానుభావుడా!" అని ఆశ్చర్యపోతూ రామారావు బావమరది ప్రకాశం తనసూటుకేసు తెరవబోయాడు. కాని—ఆశ్చర్యం! తాళం చెవిపట్టలేదు !!

"బావా, సూటుకేసు రైలులో మారుపడింది" అని గాబరాపడ్డాడు ప్రకాశం.

"పెట్టె మారుపడటం ఏమిటోయ్?" అని సందేహంగా అన్నాడు రామారావు.

"లైసెన్సు కూలీగాడ్ని సెకండ్ క్లాసులోంచి కాకీకవరు సూటుకేస్ దించరా అంటే, దీన్ని తెచ్చాడు. ఇది యింకోడిది. వాడిదీ నాలంటికేసే. వాడు నాకు బెజవాడలో కలిసాడు. రాజమండ్రి వచ్చేటప్పటికి బండీలో గుర్రుకొట్టున్నాడు బండీలో. నా సూటుకేసు బండీలోనే వుండిపోయింది" అంటూ సూటుకేసు మీదికవరు వూడదీశాడు ప్రకాశం.

పెట్టెమీద దీనానాథుని పేరుంది.

"ఈ పెట్టె దీనానాథునిదోయ్. అతను బహుశా విజయనగరం రాజాగారిని దర్శించటానికి ప్రచారార్థం వెళ్తుండవచ్చు. పర్వాలేదు. నీపెట్టె గల్లంతుకాదులే." అని ధైర్యం చెప్తూ "అయినా అతను సెకండుక్లాసులో వృధాగా ప్రయాణం చెయ్యడే!" అని కొంచెం సందేహంగా ఆలోచించాడు రామారావు.

ప్రకాశం మారుతాళంపెట్టి పెట్టెతెరచాడు. ఆపెట్టెలో దీనానాథుని వస్త్రాలున్నాయి.

"ఆ పెట్టె అతనిదే లేవోయ్, మూసేయ్" అని నిర్లక్ష్యంగా అన్నాడు రామారావు.

"అడుగుదాకా చూడనీ" అంటూ ప్రకాశం గుడ్డలన్నీ బయటకుతీసాడు.

అడుగున రూపాయిల కట్టలున్నాయి—

అరవైవేలు !!

రామారావు నిర్ఘాంతపోయాడు — అంతా అయోమయంగావుంది అతనికి—ఏమీ పాలుపోలేదు.

"అతడే నా స్వార్థత్యాగి!! అని హేళన చేశాడు ప్రకాశం. రామారావు మాట్లాడలేదు.

## 3

తర్వాత నాలుగు నెలలకు—ఒక రోజున—

విశాఖపట్నంలో ఒక పిచ్చివాడు కారుక్రింద పడ్డాడు. అతణ్ణి ఆసుపత్రికి జేర్చారు. అతనికి క్రమశః పిచ్చి కుదిరింది; కాని కారుక్రిందబడ్డ కాలుఅంతవరకు తీసివేసారు. పిచ్చివాడు కుంటివాడయ్యాడు. ఆసుపత్రిలోచేరిన ఆరునెల్లకు చంకలక్రింద కర్రలు పెట్టుకొని నడవకలిగాడు. అతనికి పూర్తి ఆరోగ్యం కలిగింది. మరునాడు అతణ్ణి ఆసుపత్రినుండి పంపేస్తారు. ఆరోజు మామూలుప్రకారం సర్జన్ విజిట్ చేయటానికి వచ్చాడు. కుంటివాడు సర్జనుకు కనికరము కలిగేలా ఏమేమో చెప్తున్నాడు. "నే చదువుకున్నవాణ్ణే — కాని అశక్తుణ్ణి — ఒకప్పుడు బాగానే జీవితం అనుభవించా—కాని యిప్పుడు దుర్భరమైపోయింది. మీరు ఏదోవిధంగా కనికరించకపోతే యీజీవికి ఆత్మహత్యే శరణ్యం" అని కుంటివాడు కంట తడిపెట్టాడు. జిల్లాసర్జను హృదయం ఆర్ద్రమైంది. "దుఃఖపడకు. రేపు మాయింటికి వచ్చేసేయి" అని అతనికి అభయమిచ్చాడు.

# 4

గుంటూరులో అనాధ శరణాలయస్థాపన జరిగి యిప్పటికి ఆరుమాసాలు గడచినాయి. శరణాలయ నామకరణ మహోత్సవ సందర్భమున రామారావు పేరు పెట్టమని మిత్రులు, శరణాలయ పోషకులు సలహాయిచ్చారు. కాని రామారావు అందుకు అంగీకరించలేదు. "ఈ పవిత్ర కార్య మహా వృక్షమునకు మొదట బీజము నాటినవాడు దీనానాధుడు. అతడు విధివశమున చోరుడే అవుగాక, అతడే వాస్తవముగా దీనిసంస్థాపకుడు. శరణాలయము అతని పేరుమీదనే ఆ చంద్రార్కము నడపబడాలి" అని మిత్రులను ఒప్పించి శరణాలయమునకు "దీనానాధుని అనాధ శరణాలయ"మని పేరు పెట్టాడు.

వందలకొద్ది అనాధులకు, వికలాంగులకు ఆశరణాలయం ఆశ్రయమిస్తోంది. పరిశ్రమాలయాలు, వస్తు విక్రయశాల, వస్తు ప్రదర్శనశాల, ఆసుపత్రి, పాఠశాల, గుమాస్తాలు, నౌకర్లు ఆశ్రితులకు నివాసస్థానములుఅన్నీ తలోవైపు — చక్కని తోట— ఆ తోటమధ్య దీనానాధుని శిలా విగ్రహం— ఆ విగ్రహందగ్గరే ఒక రేడియో—అంతా ఒక బహు రమ్యంగా కట్టించాడు శరణాలయాన్ని రామారావు.

శరణాలయం అన్నివిధాల ఆదర్శనీయంగా వుంది. దేశమంతా వ్యాపించింది దీనికీర్తి.

* * *

విశాఖపట్టణంనుండి సర్జను గుంటూరు వస్తున్నాడు. అతడు శరణాలయాన్ని యిదివరకే చూసి చాలా మెచ్చుకున్నాడు. "కుంటివాణ్ణి ఆ శరణాలయానికి పంపుతే బాగు" అనుకున్నాడు.

"నీకు ఒకచోట వుద్యోగమిప్పిస్తావస్తావా?" అని అడిగాడు సర్జన్ కుంటివాణ్ణి.

"చిత్తం. కుంటివాడికి వుద్యోగం లభ్యమవుతుందా సార్ ?"

"టేబిల్ వర్కుయిప్పిస్తా. కలంపట్టేది చేత్తోగాని కాలితో కాదుగదా. నీకెందుకు నాతో రా' అన్నాడు సర్జన్.

డాక్టరు కుంటివాణ్ణి వెంబడిపెట్టుకొని గుంటూరుచేరాడు. ఎక్కడికని అడుగుటకు ధైర్యం చాల్లేదు కాని గుంటూరు స్టేషన్‌లో దిగేటప్పుడు కుంటివాని గుండెల్లో సమ్మెటదెబ్బలు కొట్టినట్లయింది.

డాక్టరు ఆ సాయంత్రమే కుంటివాణ్ణి తీసుకొని శరణాలయానికివచ్చాడు కారులో. గేటుమీద పెద్ద అక్షరాలలో "దీనానాధుని అనాధ శరణాలయం" అని వ్రాసివుంది. కారు లోపలికి వెళ్లిపోయింది కుంటివాని శరీరంమీద వెయ్యితేళ్లు కుట్టినట్లువుంది. అతనిశరీరం కంపించింది.

ఆవాళ్ల రామారావు గ్రామాంతరంవెళ్లాడు. రాత్రికిగాని తిరిగిరాడు. అఫీసులో అతని సెక్రటరీ వున్నాడు. డాక్టరును గౌరవించి ఉచితాసనమిచ్చాడు సెక్రెటరీ.

సర్జను తాను వచ్చిన సంగతి క్లుప్తంగా చెప్పాడు. "ఇతణ్ణి మీ శరణాలయంలో జేర్చుకోవాలి. ఏదైనా గుమాస్తా గిరికి పనికివస్తాడు. అనాధుడు, అసహాయుడు. ఈ విషయం రామారావుకు చెప్పాలనివచ్చా" అని.

"మీరే యీ స్వల్ప విషయానికి స్వయంగా వచ్చారే!" అని సెక్రెటరి సర్జను ఉదారతను కొనియాడాడు.

"రామారావును, అతని శరణాలయాన్ని మరోసారి దర్శించినట్లుంటుందని బయలుదేరా" అని చిన్నమందహాసం చేసాడు సర్జన్. బల్లమీదకూర్చు కుంటివాని హృదయంలో పిడుగపడ్డట్లయింది.

ఇంతలో తోటలో గణగణమని గంట మ్రోగింది. సెక్రెటరి వెంటనేలేచి "ప్రార్థనసమయమైంది. ప్రార్థనానంతరం యితని పేరు నమోదుచేస్తా" అన్నాడు. అంతాకలసి తోటలోకి వెళ్లారు.

అప్పటికే శరణాలయ వుద్యోగులు, నౌకర్లు, అనాధులు, దీనానాధుని శిలావిగ్రహం చుట్టూ నిలబడి "జయ జయ దీనానాధా! దీనరక్షకా! దీనబందూ జయ్! జయ్!!" అంటూ ఒక్క స్వరంలో ప్రార్థిస్తున్నారు.

కుంటివాడు శిలావిగ్రహంవరకూ వచ్చి చైతన్యంతప్పి పడిపోయాడు.

* * *

ఆరాత్రే పదిగంటలకు శరణాలయ బావిలో నుండి క్రొత్తగావచ్చిన కుంటివాని శవం తీసారు.

మరునాడు రామారావువచ్చి "అరె!! యితడు దీనానాధుడు—శరణాలయ స్థాపనకర్త" అని అన్నాడు.